

కమ్ముకున్న మంచు పరదా


జాతీయ రహదారిపై కమ్ముకున్న మంచు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం పొగ మంచు కమ్మేసింది. ఉదయం నుంచి మంచు భారీగా కురిసింది. మధ్యాహ్నం వరకు మంచు కొనసాగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 216 జాతీయ రహదారిపై వాహనాలు కన్పించక నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. దీంతో వాన చోదకులు ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. పచ్చని పంట పొలాలపై మంచు పొర పరుచుకుని రహదారిపై వాకింగ్, ఇతర పనులపై వెళ్లే వారికి ఆహ్లాదం కల్గించింది. మంచు ఉదయం 11 గంటల వరకు ఉండటంతో విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, వ్యక్తిగత పనులపై వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు.

కౌలు రైతులకు..
'అన్నదాత సుఖీభవ' ఎప్పుడు..!



- కూటమి వచ్చాక నాలుగోసారి వరి సాగు
- ఇప్పటికే రెండు ఖరీఫ్, ఒక రబీ సీజన్ పూర్తి
- రెండేళ్లు గడుస్తున్నా పెట్టుబడి సాయం నిల్
- 80 శాతం సాగు కౌలురైతుల చేతుల్లోనే
- దెబ్బతిన్న పంటలకు పరిహారమూ దక్కని దుస్థితి
- రెండు జిల్లాల్లో లక్షా 80 వేల మంది కౌలురైతుల పరిస్థితి దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం కౌలురైతులను వంచించిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పంట పండించే కౌలురైతులను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం సొమ్ము కౌలురైతులకు చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి ఉంది. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద కౌలురైతులకు సైతం రూ.20 వేలు అందిస్తామంటూ కూటమి ప్రభుత్వం తెలిపింది. అధికారంలోకొచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకూ కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకూ రెండు ఖరీఫ్, ఒక రబీ సీజన్లు పూర్తయ్యాయి. నాలుగోసారి రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం రబీసాగుకు నారుమడులు సైతం ముమ్మరంగా వేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం అధికారులు తీసుకున్న లక్ష్యం ప్రకారం ఏలూరు జిల్లాలో 75 వేల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా ఐదువేల మంది మొత్తం లక్షా 80 వేల మంది కౌలురైతులు ఉన్నారు. వీరిలో ఏలూరు జిల్లాలో 62 వేల మందికి, పశ్చిమలో 80 వేల మందికి కౌలుకార్డులు జారీ చేశారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయలేదు. గడిచిన ఖరీఫ్ ఆరంభం నుంచి పెట్టుబడి సాయం సొమ్ము జమ చేయడం ప్రారంభించింది. ఇప్పటికి రెండు విడతల సొమ్ము జమ చేసింది. పెట్టుబడి సాయం కింద ఏలూరు జిల్లాలో 1,60,968 మంది, పశ్చిమలో 1,03,761 మంది లబ్ధిదారులు ఉన్నారు. దాదాపు రూ.174 కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు. మరో విడత సొమ్ము జనవరిలో వేయాల్సి ఉంది. భూయజమానులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేసిన ప్రభుత్వం కౌలురైతులను మాత్రం పూర్తిగా పక్కన పెట్టింది. అక్టోబర్‌లో కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ నెల పూర్తవుతూ, రబీ సాగు ఆరంభమైనా పెట్టుబడి సాయం సొమ్ము మాత్రం ఇవ్వలేదు. దీంతో తాము చేసిన నేరం ఏమిటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెపాల్సి ఉంది.

పంట నష్ట పరిహారమూ లేదు.. పంట రుణాలు అంతంతమాత్రమే

మొంథా తుపానుకు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున పంట నష్టం వాటిల్లింది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 12,500 ఎకరాల వరకూ పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంటనష్టం నమోదు జరిగింది. దీంతో సాగుచేసిన కౌలురైతుల పేర్లు కాకుండా భూయజమానుల పేర్లను పంటనష్టం జాబితాలో చేర్చారు. దీంతో పంటనష్టం సొమ్ము సైతం కౌలురైతులకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పంటల బీమా సొమ్ము సైతం భూయజమానులకే అందనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 62 వేల మంది రైతులకు కౌలుకార్డులు జారీ చేసి కేవలం రూ.50 కోట్లు పంటరుణాలుగా ఇవ్వగా, పశ్చిమలో 80 వేల మందికి కౌలుకార్డులు అందించి రూ.వంద కోట్లు వరకూ మాత్రమే పంట రుణాలు అందించారు. వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు ఇచ్చిన రుణాలు ఒక్కశాతం కూడా లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టాన్ని సవరిస్తామని, కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో పదేపదే చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హడావుడి సైతం చేశారు. తర్వాత మౌనం వహించారు. సాగు చేసే వాస్తవ సాగుదారుడైన కౌలురైతుల పట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యవసాయ సాగులో కౌలురైతులదే కీలకపాత్ర. అటువంటి కౌలురైతుల తరపున ప్రజాప్రతినిధులు ఏఒక్కరూ కనీసం నోరువిప్పని పరిస్థితి ఉంది. అధికారులు సైతం కౌలురైతుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. సమావేశాల్లో కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ప్రకటనలు చేయడం తప్ప.. పర్యవేక్షణ అనేది లేకుండాపోయింది. ఇప్పటికైనా కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము అందించాలని అంతా కోరుతున్నారు.


జెసికి వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు

టెట్‌పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి

విద్యాహక్కు చట్టంలో అర్హతల నిబంధన సడలించాలి
పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి
జెసి, డిఇఒకు యుటిఎఫ్ నేతల వినతి
సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెట్‌పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. అవసరమైతే విద్యాహక్కు చట్టంలో అర్హతల నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథి గోపిమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, బేషరతుగా ఇన్‌సర్వీస్ టీచర్లందరినీ టెట్ నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. అవసరమైన మేరకు విద్యాహక్కు చట్టంలో అర్హతల నిబంధనలను సెక్షన్ 23 (2) సవరణ చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికల పేరిట విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. సెలవు దినాలు, పండగ రోజుల్లో తరగతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ కనీస పని దినాలు సరిపోతున్నప్పటికీ విద్యాశాఖాధికారులు సెలవు దినాల్లో కూడా పాఠశాలలు నిర్వహించడం తగదన్నారు. జిల్లాలోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య సహాధ్యక్షులు కె.రాజశేఖర్, కోశాధికారి పి.క్రాంతి కుమార్, జిల్లా కార్యదర్శులు పి.శివప్రసాద్, ఎస్.రత్నరాజు, టిజె.జయకుమార్, జి.రామకృష్ణంరాజు, కెఎస్.రామకృష్ణప్రసాద్, పి.కృష్ణకుమారి, సిహెచ్.కుమార్‌బాబ్జి, కె.బ్రహ్మయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కెవి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న ఉద్యోగుల ఐక్యత చాటాలి

ఎపి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఎపి జెఎసి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి - భీమవరం

వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న విజయవాడలో నిర్వహించబోయే ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర మహాసభకు ఉద్యోగులు స్వచ్ఛందంగా హాజరై ఉద్యోగుల ఐక్యత చాటి చెప్పాలని ఎపి జెఎసి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక త్యాగరాజు భవనంలో గురువారం మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ఇప్పటికే ఆర్‌టిసి ఉద్యోగులు వేలాది మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మహిళా ఉద్యోగినులకు చైల్డ్‌కేర్ లీవ్ సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా వాడుకునేలా చారిత్రాత్మక ఉత్తర్వులు ఇటీవల జారీ చేశారన్నారు. ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అన్నీ ఆన్‌లైన్‌లో ఒకేసారి వచ్చేలా జిపిఎఫ్, ఎపి జిఎల్ఐ లోన్లు, ఉపసంహరణ అన్నీ ఆన్‌లైన్‌లో సేవలందించాలని నిర్ణయిస్తూ త్వరలో ఉత్తర్వులు రాబోతున్నాయన్నారు. ఆర్థికపరమైన అంశాలపై కూడా రాబోయే రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకుంటారనే నమ్మకం ఉందని తెలిపారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్‌గా వివి.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీగా పవన్ సత్యనారాయణ, ట్రెజరర్‌గా ఎం.కనకారావు, జిల్లా మహిళా విభాగం ఛైర్‌పర్సన్‌గా డి.సుగుణ సంధ్య, జనరల్ సెక్రటరీగా బి.అరుణ, కోశాధికారిగా ఐ.గంగారత్నం ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఫణి పేర్రాజు, పొన్నూరు విజయలక్ష్మి, కోనా ఆంజనేయకుమార్, ఎస్.మల్లేశ్వరరావు, జి.అనుపమ, ఐవివి.సత్యనారాయణ, అల్లం సత్యనారాయణ, ఎం.కనకారావు, సత్యనారాయణ, మంతెన రామప్రసాద్‌రాజు, జగన్, జీవన, రవిరాజు, బుజ్జయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీస్తే సహించం

నేడు జిల్లావ్యాప్తంగా గాంధీ విగ్రహాల వద్ద సత్యాగ్రహ దీక్షలు
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ హెచ్చరించారు. కేంద్రం ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ శుక్రవారం అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో గాంధీబొమ్మల వద్ద నల్ల జెండాలతో, నోటికి అడ్డంగా గుడ్డలు కట్టుకుని సత్యాగ్రహ దీక్షలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ దీక్షల్లో ప్రజానీకం, గ్రామీణ వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ఉపాధిని హక్కుగా తొలగించి ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పథకంగా మార్చేసిందన్నారు. ఉపాధి హామీ చట్టం అమలుకు ఇప్పటి వరకూ కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు ఖర్చు చేస్తున్నాయన్నారు. ఇప్పుడు దానిని మార్పు చేస్తూ కేంద్రం 60 శాతం, మిగిలింది రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇతర ఏ పనులూ లేనప్పుడు ఏడాదిలో వంద రోజుల పని ఎక్కడైనా పొందే హక్కు 2005 ఉపాధి హామీ చట్టంలో ఉందన్నారు. దానిని ఇప్పుడు మార్చి ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాల్లో 60 రోజులు పని చేయడానికి వీల్లేదని చట్టాన్ని మార్చారన్నారు. ఈ పథకం ఇప్పటి వరకు మహాత్మాగాంధీ పేరుతో ఉందని, దీన్ని ఇప్పుడు జీ రామ్‌జీ పేరుకు మార్చి మతం రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ మార్పుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. తక్షణం ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

చేపలు, రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎపి ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.బలరాం
ఆక్వా రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి
ఆక్వా రైతుల జిల్లా సదస్సు తీర్మానం


అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - కలిదిండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని, చేపలు, రొయ్యల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.బలరాం, చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) డిమాండ్ చేశారు. గురువారం కలిదిండిలోని కళ్యాణి ఫంక్షన్ హాలులో ట్రంప్ సుంకాలు-సంక్షోభంలో ఆక్వా రంగం-పరిష్కార మార్గాలు అనే అంశంపై ఆక్వా రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్.మహంకాళిరావు అధ్యక్షత వహించారు. ఆక్వా రైతాంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథులు బి.బలరాం, తాడినాడ బాబు మాట్లాడుతూ ట్రంప్ సుంకాల వల్ల ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాల నుండి ఆక్వా రంగాన్ని కాపాడాలని కోరారు. ప్రస్తుతం ఆక్వా ఉత్పత్తులకు స్థిరమైన, నిలకడైన ధరలు లేకపోవడం వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరిగి ఆక్వా రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఆక్వా ఫీడ్‌కు సంబంధించిన సోయాబీన్ వంటి ముడి సరుకుల ధరలు తగ్గినా ఫీడ్ ధరలు తగ్గించకపోవడం అన్యాయమన్నారు. సీడ్, ఫీడ్ నాణ్యత ఉండటం లేదని చెప్పారు. ఫీడ్ ధరలు తగ్గించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ సబ్సిడీ రైతులందరికీ వర్తింపజేయాలని, పెంచిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు తగ్గించాలని అన్నారు. ఆక్వారంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆక్వా ప్రాంతంలోని కాల్వలు బాగు చేసే బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. కాలువలు ఆధునికీకరించాలని కోరారు. పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు కుదింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ రద్దు చేయాలన్నారు. ఆక్వా ప్రాంతంలో రోడ్లు వంటి మౌలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. అందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. సదస్సులో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆక్వా టెక్ పత్రిక ఎడిటర్ జోసెఫ్, ఆదర్శ చేపల రైతు కోకా శ్రీనివాసరావు, సుస్థిర వ్యవసాయ ప్రతినిధి షేక్ ఆలీ హుస్సేన్, ఆక్వా రైతులు పాల్గొన్నారు.


అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎపి నిట్ సంచార మిత్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు


మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎపి నిట్ నిట్ సంచారమిత్ర నోడల్ ఆఫీసర్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ నరసింహారావు బనవతు సూచించారు. ఎపి నిట్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, భారత ప్రభుత్వ టెలి కమ్యూనికేషన్ల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ విజిలెన్స్-ఎఐ, క్వాంటం యుగంలో పెరుగుతున్న మోసాలకు వ్యతిరేకంగా రక్షణ అనే అంశంపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సందేశాలు, లింకులు సెల్‌ఫోన్లకు పంపుతున్నారని, పొరపాటున వాటిపై క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలోని సొమ్ము ఖాళీ చేస్తున్నారని చెప్పారు. మనకు తెలియని, అనవసర లింకులను క్లిక్ చేస్తే ఫోన్లు హ్యాక్ కావడంతోపాటు డేటా చోరీకి గురవుతుందన్నారు. మోసాలకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా మనల్ని మనమే రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సంచార్ మిత్రగా ఎంపికైన విద్యార్థులు కెవిఎస్.చైతన్యప్రతాప్, కె.వెంకటరాజీవ్‌రెడ్డి, జి.ధీరజ్ మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా యువతకు దిశానిర్దేశం చేయాలని సూచించారు.

ఎఫ్‌డిఐ పెంపుదల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

ఎస్‌బిఐ వద్ద బ్యాంకు ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బీమా రంగంలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపుదల దేశీయ ఆర్థిక వ్యవస్థలో తిరోగమన చర్య అని, దేశీయ పెట్టుబడులకు ప్రమాదం కలిగిస్తుందని బ్యాంకు యూనియన్ నాయకులు తెలిపారు. బ్యాంకు యూనియన్ల దేశవ్యాప్త నిరసనలో భాగంగా గురువారం కెఎన్ రోడ్డు ఎస్‌బిఐ ఈ కార్నర్ శాఖ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఎఫ్‌డిఐ పెంపుదల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలన్నారు. సుమారు రూ.80 లక్షల కోట్ల పెట్టుబడులు దేశ బీమా పరిశ్రమలో ఉన్నాయన్నారు. ఈ విదేశీ ఎఫ్‌డిఐల పెట్టుబడులతో దేశీయ బీమారంగం విదేశీ ఆధిపత్యంలోకి పోతోందని, దేశీయ పెట్టుబడులకు నష్టం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ప్రజలకు నష్టం కలిగించే ఏ చర్యలనూ బ్యాంకు యూనియన్లు అంగీకరించవని, ఈ ప్రజావ్యతిరేక చర్యలను పోరాటాల ద్వారా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. భవిష్యత్తులో బీమా ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలతో కలిసి విస్తృత పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ అధికారుల సమాఖ్య జోనల్ కార్యదర్శి జి.జవహర్లాల్ లాల్, ఇండియన్ బ్యాంకు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు చైతన్య, ఒఐ స్టాఫ్ యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఏడుకొండలు, కోఆర్డినేషన్ కమిటీ నాయకులు లింగంపల్లి గాంధీ, విఆర్‌ఎస్‌ఎన్.శాస్త్రి, నాగరాజు శీతలం నారాయణమూర్తి, స్టేట్ బ్యాంకు యుడిజె నాయకులు పవన్ కుమార్ డానియేల్, కిరణ్, శ్రీనివాస్, ఆర్.సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న వ్యకాస నేతలు

'ఉపాధి హామీ'లో మార్పులపై నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో మార్పులను వ్యతిరేకిస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మోగల్లులో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడుతూ ఈ మార్పుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. బిజెపి ప్రభుత్వం పేదల పొట్టకొట్టడం తగదన్నారు. తక్షణం ఆ మార్పులు ఆపి ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని కోరారు. సంఘం మండలాధ్యక్షులు వీరవల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి రామానుజ దాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తణుకు

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలో సిఐటియు మహాసభ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జరగనున్న మహాసభకు ప్రజలు సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్మికులకు బానిసలుగా మార్చే మోడీ ప్రయత్నాలు కార్మికులందరూ వ్యతిరేకించాలని అన్నారు. ఏ దేశం అభివృద్ధి అయినా అది కార్మిక వర్గం శ్రమ ద్వారానేనని అన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న హక్కులు, లేబర్ కోడ్స్ అమలు ద్వారా తొలగించడం సిగ్గు చేటు అన్నారు. స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో మోడీ పాలనపై పోరాటం సాగించాల్సిన పరిస్థితి కార్మిక వర్గానికి నేడు వచ్చిందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలతో మోడీకి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలం కన్వీనర్ గుబ్బల గోపి, కో కన్వీనర్ ఎన్.ఆదినారాయణబాబు, అజయ కుమారి, గార రంగారావు, కుమార్, రాంబాబు, బంగారమ్మ పాల్గొన్నారు.

దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలి

ఐపిఎస్ అధికారి పివి.సునీల్‌కుమార్

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలోని దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని ఐపిఎస్ అధికారి పివి.సునీల్‌కుమార్ అన్నారు. పెనుమంచిలిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను ఆయా పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సిల్లో ఉన్నత విద్యార్హతలు కలిగి ఉద్యోగాలు లేని యువతకు ప్రత్యేక నిధులు, రుణాలు కేటాయించి వారి అభ్యున్నతికి ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో కాపులు, దళితులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జనాభాలో 25 శాతం కంటే ఎక్కువ ఉన్న ఈ రెండు తరగతులు కలిస్తే రాజకీయాధికారం సాధ్యమవుతుందని తెలిపారు. అయితే ఉద్దేశపూర్వకంగా ఈ ఐక్యతను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాపులకు, దళితులకు మధ్య మౌలికంగా ఎలాంటి విభేదాలు లేవని, గ్రామస్థాయిలో ఉన్న చిన్నచిన్న సమస్యలను కొంతమంది భూతద్దంలో చూపించి పెద్ద విభేదాలుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. కాపులు రెండున్నర సంవత్సరాలు, దళితులు రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిలో ఉండేలా ఆలోచనలు వ్యక్తమయ్యాయన్నారు. రాజకీయాలు ఇచ్చిపుచ్చుకునే విధంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. దీనికి బిసిలు మద్దతు తెలపాలని కోరారు.

బిజెపి చర్యలను ఎండగట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



మాట్లాడుతున్న గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి పేదల కడుపు కొట్టి కార్పొరేట్లకు పట్టు తివాచీ పరిచే బిజెపి చర్యలను ఎండగట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి. గోపాలన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకురాలు సంకు ఉదయ కుమారి అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పేరు తొలగించి చట్టం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు చట్టం పేరు మార్చి పథకానికి నిధులు తగ్గించడం ఎంత మాత్రమూ తగదన్నారు. గత 11 సంవత్సరాలుగా చట్టానికి నిధులు క్రమంగా తగ్గిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు పేరు మార్చి పేదలకు పనులు తగ్గే విధంగా రాష్ట్రాలపై భారాలవేసే పద్ధతిలో చట్టం చేయడం దుర్మార్గం అన్నారు. అప్పుల పాలు అయిపోయిన ఆంధ్ర రాష్ట్రంపై నాలుగు వేల కోట్ల రూపాయల అదనపు భారం వేసినా చంద్రబాబు నోరు మెదపకపోవడం పేదలపై భారం వేయడమేనన్నారు. మోడీ భజన మాని పాత పద్ధతిలో నిధులు మంజూరు చేసే చట్టం అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో భారీ స్థాయిలో ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు, పార్టీ నాయకులు పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, బి.వి.వర్మ, బి.రాంబాబు, కె.కళ్యాణి, డోకల రవి కిరంకర్ పాల్గొన్నారు.

కాపు సంక్షేమానికి నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

కాపు సంఘం మండల మాజీ అధ్యక్షులు, వైఎస్ పాలెం మాజీ సర్పంచి కునపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు గురువారం సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం.పవన్ కళ్యాణ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడుకు కాపు సమస్యలపై వినతి పత్రాన్ని రిజిస్టర్ పోస్టు ద్వారా పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాపు సంక్షేమానికి ఎన్నికల మేనిఫెస్టోలో 15 వేల కోట్ల రూపాయలు ఐదు సంవత్సరాలకు గాను కేటాయిస్తామని హామీ ఇచ్చిన సంగతి ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం చేపట్టి రెండేళ్లయినా నేటి వరకు నిధులు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. కాపుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి కాపుల సాధికారిత, మహిళల స్వయంఉపాధివృద్ధికి, స్వయం ఉపాధికి ప్రాధాన్యమిస్తామని ఎన్నికల హామీని తక్షణం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినందున 6 వేల కోట్ల రూపాయల నిధులు కాపు సంక్షేమానికి కేటాయించి కూటమి ప్రభుత్వం కాపుల పట్ల చిత్తశుద్ధి చూపాలని వినతి పత్రాలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపినట్లు తెలిపారు.

వ్యాయామ అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

గణపవరం:గణపవరం డిగ్రీ కాలేజీలో వ్యాయామ అధ్యాపక అతిథి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలన్నారు. పిహెచ్‌డి లేదా నెట్ స్లెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. 30వ తేదీ అభ్యర్థులకు ముఖాముఖి పరీక్షలు నిర్వహించి ఎంపికైన వారికి అదేరోజు పోస్టింగ్ ఇస్తామని తెలిపారు.

మొగల్తూరులో అన్నదానం

మొగల్తూరు:మొగల్తూరులోని కోట రోడ్డులోని శ్రీ దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దత్తసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు శెట్టి మోహనరావు పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పలువురికి వాకర్స్ క్లబ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆపన్నులకు సహాయం చేయగలగడం భగవంతుడు మనకిచ్చిన మంచి అవకాశమని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. గురువారం పాలకొల్లు కొత్త కుళాయి చెరువు వద్ద వాకర్స్ క్లబ్ తరపున మేడపాడు గ్రామానికి చెందిన వృద్ధురాలు గంధం జయకు 8 వేల రూపాయల విలువైన వినికిడి యంత్రం, పాలకొల్లు పట్టణం 23వ వార్డుకు చెందిన గుండె, లివర్ సమస్యతో బాధపడుతున్న షేక్ బాబుకు గుంటూరు జనరల్ హాస్పటల్‌కు వెళ్లి వైద్యం చేయించుకునే నిమిత్తం రూ.5 వేల సాయం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, పూర్వ గవర్నర్ ఆకి రామకృష్ణ, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు పాల్గొన్నారు.

రాజకీయ అనుభవజ్ఞులు రామ్మోహన్ నాయుడు

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రస్తుత రాజకీయాల్లో అనుభవజ్ఞులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అని విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం 17వ వార్డులో కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా 17వ వార్డులో గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో నిలిచిపోయే స్థానం కలిగిన రాజకీయ నాయకుల్లో రామ్మోహన్ నాయుడు అన్నారు.

పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

సామాజిక తనిఖీలు పారదర్శంగా నిర్వహించాలని ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉపాధి హామీ చట్టంలో సామాజిక తనిఖీలకు నియమితులైన సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీలో నిధులు, వ్యయం, పనులు, కూలీల వివరాలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పికెవి.రమణ, డిఆర్‌పి గంగుల సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఎఇ వెంకటేశ్వరరావు, ఎన్ఆర్‌జిఎస్ ఎపిఒ జవ్వాది వెంకటేశ్వరరావు, జిఇవి.ఆనంద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం సహాయ నిధి పేదలకు వరమని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల నివాసాలకు స్వయంగా వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.7,87,498 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కష్టకాలంలో పేదల పక్షాన ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు.

రామరాజుకు గంటా శుభాకాంక్షలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి జిల్లా అధ్యక్షులుగా రెండోసారి నియమితులైన ఉండి మాజీ ఎంఎల్‌ఎ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజుకు కృష్ణబలిజ పూసల వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గంట త్రిమూర్తులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంతెన రామరాజును కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో మంతెన రామరాజు నాయకత్వం కీలకమని గంటా త్రిమూర్తులు అన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, టిడిపి జిల్లా కార్యదర్శి మైలా బత్తుల ఐజాక్ బాబు, కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారామ్, ఇందుకూరి రామలింగరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నరసాపురం

మండలం యర్రంశెట్టి వారిపాలెంపాలెం జెడ్‌పి హైస్కూల్లో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల వివాహ ముక్త్ భారత్ 100 రోజుల కాంపెయిన్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్ దుర్గాభవాని మాట్లాడుతూ పేదరికం, బాల్య వివాహం పట్ల అవగాహన లేకపోవడం వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం బాల్య వివాహానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి

ప్రజాశక్తి - గణపవరం

మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ భవనంలో జరిగిన మానవ అక్రమ రవాణాపై అవగాహనా కార్యక్రమంలో ఎంపిడిఒ పాల్గొని మాట్లాడారు. మనుషుల రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరమన్నారు. యువతులకు సినిమా అవకాశాలు చూపించి వారిని మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని తెలిపారు. డిప్యూటీ ఎంపిడిఒ కె.శివాజీ, ప్రజ్వల అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మిథాలీరాజ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పరిపాలన అధికారి రంగనాయకులు, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఇరగవరం:యువతులు, మహిళల అక్రమ రవాణా జరుగుతోందని, దీనిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసు తెలిపారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు హైదరాబాద్ ప్రజ్వలా స్వచ్ఛంద సంస్థ ద్వారా శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసు మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని, ప్రతి రోజూ ఎంతో మంది యువతులు, మహిళలు దీనికి గురవుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని తెలిపారు.ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ 29 సంవత్సరాలుగా పద్మశ్రీ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ, పోలీస్, విద్యా, న్యాయ వ్యవస్థను శాఖల సమన్వయంతో ఇప్పటివరకూ 30,200 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. మహిళా పోలీసులు మాట్లాడుతూ నేటి కాలంలో యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని తెలిపారు. గ్రామం పరిధిలో అవగాహన కల్పించి జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు హాజరయ్యారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

భీమవరం టౌన్:విద్యార్థులు ఏ రంగంలో నైపుణ్యం సాధించాలనుకుంటున్నారో ముందుగానే నిర్ణయించుకుని ఆ దిశగా హార్డ్ వర్క్ చేయాలని అమ్మాయిపై ప్రోగ్రాం మేనేజర్ మంతెన శృతి తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆమె మాట్లాడుతూ ఉన్నత స్థానానికి వెళ్లేందుకు ధనం ఒక్కటే మూలం కాదని లక్ష్యసాధన, ప్రేరణ ముఖ్యమని తెలిపారు. లక్ష్యం సాధించాలంటే హార్డ్ వర్క్ చేయాలన్నారు. యావరేజ్ విద్యార్థి కూడా లక్ష్యం ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, వాటికి ముందుగా ఇంగ్లీష్ భాషపై పట్టు భావవ్యక్తీకరణ అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ హెడ్ బిహెచ్‌వి ఎస్.రామకృష్ణంరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్.దిలీప్ చక్రవర్తి మాట్లాడారు. అనంతరం కళాశాల తరపున మంతెన శృతిని ఘనంగా సత్కరించారు.

27, 28 తేదీల్లో నెట్‌బాల్ పోటీలకు ఎంపికలు

భీమవరం :తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగబోయే సీనియర్ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్ల ఎంపిక 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో జరగనున్నాయని జిల్లా నెట్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్.విజయలక్ష్మి తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 9493995839, 9885886722 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తిలో వాణిజ్య విభాగం, కన్స్యూమర్ క్లబ్, ఐక్యూఎసి, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ తరపున జాతీయ వినియోగదారుల దినోత్సవం గురువారం జరిగింది. వారోత్సవాల్లో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన వినియోగదారుల రక్షణ చట్టం అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా హబీబ్ సుల్తాన్ అలీ, అడ్వకేట్ సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ఫౌండర్ ఆఫ్ ఆసరా న్యూఢిల్లీ, వరుడు నాగరాజు, ఎన్‌టిఆర్ జిల్లా ఆసరా ప్రెసిడెంట్ విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వినియోగదారులకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. వినియోగదారులు వారి హక్కులను తెలుసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్ హబీబ్ సుల్తాన్ అలీ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు ఫిర్యాదు ప్రక్రియ మరింత సులభమైంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వినియోగదారుల కమిషన్లు ఏర్పాటు చేసి త్వరితగతిన న్యాయం అందిస్తున్నారని తెలిపారు. మరో రిసోర్స్ పర్సన్ వరుడు నాగరాజు మాట్లాడుతూ చట్టంపై అవగాహన పెరిగితేనే వినియోగదారులు తమ హక్కులను సమర్థంగా వినియోగించుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఇన్‌ఛార్జి టి.కృష్ణ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అకడమిక్ కోఆర్డినేటర్ వి.యామిని, ఐఐసి కన్వీనర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధికి రైతుల సహకారం కావాలి

తాడేపల్లిగూడెం:నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైతే రైతుల సహకారం కావాలని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని నవాబుపాలెం, ఆరుగొలను ఆర్ఒబిల ఏర్పాటుకు స్థల సేకరణకు గురువారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం కావాలన్నారు. నవాబు పాలెం, ఆరుగొలనులో ఆర్ఒబిల ఏర్పాటుకు ఏడెకరాల భూమి అవసరం అవుతుందని, మారంపల్లి గ్రామానికి శాశ్వత రోడ్డు ఏర్పాటుకు 70 సెంట్ల పొలం అవసరం అవుతుందని తెలిపారు. ఆ భూమిని రైతులు ప్రభుత్వానికి అందిస్తే రైతులకు మార్కెట్ ధర ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వానికి భూమి అందిస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, డిప్యూటీ సర్వేయర్ రౌతు రామకృష్ణ, మండల సర్వేయర్ చక్రవర్తి పాల్గొన్నారు.

మెడ్ యునైటెడ్ హాస్పటల్స్‌లో 'మెడ్‌పాస్' ప్రారంభం

బ్రోచర్లను ఆవిష్కరించిన ఆర్‌డిఒ దాసిరాజు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ, ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రజలు ఆసుపత్రికి వెళ్లడానికి వైద్యం ఖర్చు ఎంత అవుతుందో అని భయపడుతున్నారని, సమస్యకు పరిష్కారంగా మెడ్ యునైటెడ్ హాస్పటల్స్ సంస్థ 'మెడ్‌పాస్' అనే కుటుంబ ఆరోగ్య మెంబర్ షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం శుభపరిణామమని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. గురువారం పాలకొల్లు - పూలపల్లి రోడ్డులోని మెడ్ యునైటెడ్ హాస్పటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆర్‌డిఒ దాసిరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, సెక్రటరీ సీతారామరాజు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారై మాట్లాడారు. మెడ్‌పాస్ ద్వారా ఒక కుటుంబం మొత్తం అపరిమిత ఒపి కన్సల్టేషన్లు, డాక్టర్ సూచనతో ఉచిత డయాగ్నస్టిక్, ల్యాబ్ పరీక్షలు పొందేలా ఈ మెంబర్‌షిప్‌నకు సంవత్సరానికి కేవలం రూ.999 మాత్రమే చెల్లించేలా ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఈ సేవలు పాలకొల్లు ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురావడం వల్ల ఎంతోమందికి మేలు చేకూరుతుందన్నారు. అనంతరం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను వైద్య బృందం సమక్షంలో ఆవిష్కరించారు. మెడ్ యునైటెడ్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవివర్మ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఖర్చుల భయంతో ఆసుపత్రికి రావడం ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. ఆ భయాన్ని తొలగించి, ప్రజలు ముందుగానే చికిత్స తీసుకునేలా చేయడమే తమ ఉద్దేశమని తెలిపారు. మెడ్ యునైటెడ్ హాస్పటల్స్ సిఇఒ పిఎస్.కళ్యాణ్ వర్మ మాట్లాడుతూ తమ లక్ష్యం కేవలం చికిత్స చేయడమే మాత్రమే కాదని, సమస్య రావడానికి ముందే దాన్ని గుర్తించి ఆపడమని తెలిపారు. ఆరోగ్యం విలాసం కాదని, ప్రతి కుటుంబానికి అవసరమని తెలిపారు. మెడ్‌పాస్ అనేది కేవలం ఒక ఆఫర్ కాదని, ప్రజలకు నమ్మకం కలిగించే దీర్ఘకాలికంగా ఆరోగ్యాన్ని కాపాడే ప్రివెంటివ్ కేర్ ఆధారిత వైద్య వ్యాగ్దానం అని మెడ్యునైటెడ్ హాస్పిటల్ వైద్య బృందం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో వైద్యులు హృదయ మోహన్, డాక్టర్ అనుపమ, డాక్టర్ కావ్య, డాక్టర్ కుసుమ, డాక్టర్ అహ్మద్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ రాజు, సిఇఒ కళ్యాణ్ వర్మ, సిఒఒ డాక్టర్ అశ్విన్ పాల్గొన్నారు.

20 నుంచి నరసాపురంలో 'హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో'

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాదలో నిర్వహించే 'హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో' ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇపిహెచ్ బోర్డు సభ్యుడు కలవకొలను నాగ తులసీరావు, ఈడి రాకేష్‌శర్మ అన్నారు. గురువారం ఐఎల్‌టిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యూఢిల్లీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ వారి ఆధ్వర్యంలో నరసాపురంలో నిర్వహించనున్న 'హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పో'ను ప్రజలు తిలకించాలని తెలిపారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్తు, వస్త్ర ప్రదర్శనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకూ ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ నరసాపురం రుస్తుంబాద కొత్తకాలువ రోడ్డులోని ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ వద్ద 'హ్యాండీ క్రాఫ్ట్స్‌ఎక్స్‌పో' ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎక్స్‌పోలో దేశంలో ప్రసిద్ధిగాంచిన హ్యాండీ క్రాఫ్ట్స్, ఫ్యాషన్ జ్యుయిలరీ, గృహోపకరణాలు, హోమ్ ఫర్నీషింగ్, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగ్స్, రెడీమేడ్ వస్త్రాలు, తదితర వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఉంటుందన్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్ కోర్టు, ప్లేయింగ్ జోన్, సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 15 రాష్ట్రాల నుండి 65 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రారంభిస్తారన్నారు. ఎగ్జిబిషన్‌కు ప్రవేశం ఉచితమని, ప్రజలందరూ ఎగ్జిబిషన్ సందర్శించాలని సూచించారు. కలవకొలను రాజీవ్, అడ్డగల్ల బాబు, సాయి బాబా, కావలి నాని పాల్గొన్నారు.

నూతన ఎన్‌జిఒ కార్యవర్గం ఎన్నిక

నరసాపురం:పట్టణంలోని ఎపి ఎన్‌జిఒ హోం భవనంలో గురువారం ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నరసాపురం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా ఎం. రాజేష్‌చంద్ర, కార్యదర్శిగా ఎన్.వరప్రసాద్, సభ్యులు వివిఎస్‌వి‌ఆర్. కిషోర్, రాజేశ్వరి, డి.శ్రీనివాస్, ఎల్.నరసమ్మ, మధు, టి.సురేష్‌బాబు, ప్రసన్నకుమార్, పుల్లాజీ, దుర్గాప్రసాద్, వినయ్ కుమార్, ఆలీ, బి.అశోక్ సాంబశివరావు, విద్యాసాగర్ ఏకగ్రీవంగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గుడాల హరిబాబు వ్యవహరించారు. కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి నెరుసు రామారావు, పాలంకి సుబ్బరాయన్, గుబ్బల ప్రసాద్, రమేష్ రెడ్డి ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ఎపి ఎన్‌జిఒ హోం అడహక్ కమిటీ ఛైర్మన్ పాండు రంగారావు కొత్త కమిటీ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు బోడగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త కమిటీలు నిబ్ధతతో పని చేసి ఉద్యోగుల సమస్యలపై పోరాడాలన్నారు. సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అనంతరం ఎన్‌జిఒ సంఘం నాయకులు సుబ్బరాయన్, మామిళ్ల రామ సుబ్బారావు, ఆత్మూరి వెంకట నరసయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హరినాథ్, శ్రీనివాసులు, సుకుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సత్కారం

కాళ్ల:తనను క్లాస్ మెంట్స్ సత్కరించడం గర్వంగా ఉందని కాళ్ల జెడ్‌పి హైస్కూల్, కాళ్ల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ పెంకి విజయకుమార్ గురువారం తెలిపారు. గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వజ్రోత్సవ వేడుకల సభావేదికపై 2000-01 బిఇడి, టీచర్ ట్రెయినింగ్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్‌పి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పెంకి విజయ కుమార్ మాట్లాడుతూ ఎంఫిల్‌లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గోల్డ్ మెడల్, తెలుగు సాహిత్యంలో పిహెచ్‌డి చేసి డాక్టరేట్ పట్టా సాధించానని తెలిపారు. ఎఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు.

డిఎన్ఆర్ విద్యార్థినుల ప్రతిభ

పాలకొల్లు :ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ కళాశాలల షటిల్ పోటీల్లో పాలకొల్లు దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఫిజికల్ డైరెక్టర్ లంకపల్లి రమేష్ శిక్షణలో ద్వితీయ స్థానం పొందారని ప్రిన్సిపల్ శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ టీం సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన యమునా దేవి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది గెలుపొందిన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

భారత ప్రభుత్వం
भारतसरकार
पर्यावरण, वनएवंजलवायुपरिवर्तनमंत्रालय
పర్యావరణం, అడవులు మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ
ప్రాంతీయ కార్యాలయం, చెన్నై (ఉపకార్యాలయం - విజయవాడ)
గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, విజయవాడ - 520010, ఆంధ్రప్రదేశ్
ఈ-మెయిల్: iro.vijayawada-mefcc@gov.in, ప్రాంతీయ కార్యాలయం, చెన్నై

ఆన్‌లైన్ ప్రతిపాదన సంఖ్య: FP/AP/OFC/446675/2023 **తేదీ: 27/11/2025**

To,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యావరణం, అడవులు, సైన్స్ & టెక్నాలజీ విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గది నెం.268, 1వ అంతస్తు, 4వ బ్లాక్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, వెలగపూడి, అమరావతి గుంటూరు జిల్లా-522503

విషయం: ఏలూరు అటవీ డివిజన్‌లోని "కొయ్యలగూడెం - కన్నాపురం-గోగుమిల్లి-ఉర్రింక-రావిగూడెం" మార్గం మధ్య రోడ్ల వెంట భూగర్భ **OFC** వేయడానికి 1.25 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడానికి ప్రతిపాదన మెస్సర్స్ భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ (గతంలో టెలిసోనిక్ నెట్‌వర్క్స్ లిమిటెడ్), హైదరాబాద్‌కు అనుకూలంగా.

సర్/మేడమ్:పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, **1980** సెక్షన్ **2(1)** కింద కేంద్ర ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి కోరుతూ పరివేష్ **2.0** ద్వారా అందిన రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆన్‌లైన్ ప్రతిపాదన నెం.**FP/AP/OFC/446675/2023**, తేదీ **27.11.2025** మరియు పర్యావరణం, అటవీప్రాంతాలు, శాస్త్రాలు & సాంకేతిక (సెక్షన్ - II) శాఖ **G.O.Ms.No.73** తేదీ **08.12.2025** లను సూచించమని నన్ను ఆదేశించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, **1.25** హెక్టార్ల మళ్లింపు కోసం వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, **1980** సెక్షన్ **'2 (1)'** కింద కేంద్ర ప్రభుత్వం యొక్క సూత్రప్రాయ ఆమోదం (స్టేజ్-2) ను తెలియజేయమని నన్ను ఆదేశించడం జరిగింది. ఏలూరు ఫారెస్ట్ డివిజన్‌లోని "కొయ్యలగూడెం - కన్నాపురం-గోగుమిల్లి-ఉర్రింక-రావిగూడెం" మార్గం మధ్య రోడ్ల వెంట భూగర్భ OFC వేయడానికి అటవీ భూమిని మెస్సర్స్ భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్ (గతంలో టెలిసోనిక్ నెట్‌వర్క్స్ లిమిటెడ్), హైదరాబాద్‌కు ఈ క్రింది షరతులకు లోబడి:-

1. సాధారణ షరతులు

వ. నెం	స్టేజ్-2 షరతులు
1.1	అటవీ భూమి యొక్క చట్టపరమైన స్థితి మారదు.
1.2	అటవీ భూమిలో కార్మిక శిబిరాలను ఏర్పాటు చేయకూడదు.
1.3	సమీపంలోని అటవీ ప్రాంతాలపై ఎటువంటి నష్టం మరియు ఒత్తిడిని నివారించడానికి యూజర్ ఏజెన్సీ సైట్‌లో పనిచేసే కార్మికులు మరియు సిబ్బందికి ప్రాధాన్యంగా ప్రత్యామ్నాయ ఇంధనాలను అందించాలి.
1.4	ప్రతిపాదనలో పేర్కొన్న దానికంటే ఇతర ప్రయోజనాల కోసం అటవీ భూమిని ఉపయోగించకూడదు.
1.5	కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ప్రతిపాదన యొక్క లేఅవుట్ ప్లాన్‌ను మార్చకూడదు.
1.6	మళ్లించాలని ప్రతిపాదించబడిన అటవీ భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా మరే ఇతర ఏజెన్సీ, విభాగం లేదా వ్యక్తికి బదిలీ చేయకూడదు.
1.7	పరిసర ప్రాంతంలోని వృక్షజాలం మరియు జంతుజాలానికి ఎటువంటి నష్టం కలిగించకూడదు.
1.8	ఈ ఆమోదం కింద మళ్లింపు వ్యవధి, వినియోగదారు ఏజెన్సీ లేదా ప్రాజెక్ట్ జీవితకాలం తరపున మంజూరు చేయబడే లీజు వ్యవధితో సహ-ముగింపు అవుతుంది, ఏది తక్కువైతే అది.
1.9	నిర్మాణ పనుల రవాణా కోసం అటవీ ప్రాంతం లోపల అదనపు లేదా కొత్త మార్గాలు నిర్మించబడవు ప్రాజెక్ట్ పని అమలుకు అవసరమైన సామగ్రి
1.10	ప్రాజెక్టు కోసం ఉపయోగించిన మొత్తం అటవీ ప్రాంతం 1.25 హెక్టార్లకు మించకూడదు.
1.11	సంబంధిత డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, చుట్టుపక్కల ప్రాంతంలోని అడవిపై ఎటువంటి ప్రతికూల ప్రభావం లేదని నిర్ధారించడానికి అవసరమైన ఉపశమన చర్యలు తీసుకుంటారు మరియు పర్యవేక్షిస్తారు.
1.12	పైన పేర్కొన్న షరతులకు సంబంధించి వినియోగదారు ఏజెన్సీ ప్రతి సంవత్సరం మార్చి చివరి నాటికి రాష్ట్ర ప్రభుత్వానికి మరియు ప్రాంతీయ కార్యాలయానికి వార్షిక స్వీయ-సమ్మతి నివేదికను సమర్పించాలి.
1.13	ఈ ప్రాజెక్టుకు వర్తించే విధంగా ప్రస్తుతానికి అమలులో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని చట్టాలు, నియమాలు, నిబంధనలు మరియు మార్గదర్శకాలు, గౌరవనీయ న్యాయస్థాన ఆదేశాలు మరియు %చీ+ు% ఆదేశాలు (లు) యొక్క అన్ని నిబంధనలను వినియోగదారు ఏజెన్సీ పాటించాలి.
1.14	వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, 1980 కింద జారీ చేయబడిన నియమాలు / మార్గదర్శకాల ప్రకారం అటవీ హక్కుల చట్టం, 2006 ప్రకారం పాటించాల్సిన షరతులను ఖచ్చితంగా పాటించాలి.
1.15	అటవీ వన్యప్రాణుల పరిరక్షణ, రక్షణ మరియు అభివృద్ధి దృష్ట్యా పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు నిర్దేశించే ఏవైనా ఇతర షరతులు
1.16	ఈ షరతులలో దేనినైనా ఉల్లంఘిస్తే అది వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం, 1980 ఉల్లంఘన అవుతుంది మరియు సంబంధిత చట్టం, నియమాలు మరియు మార్గదర్శకాల ప్రకారం సూచించిన విధంగా చర్య తీసుకోబడుతుంది.

2. ప్రామాణిక షరతులు

వ. నెం	స్టేజ్-2 షరతులు	ప్రత్యుత్తరం
2.1	N/A	

3. నిర్దిష్ట షరతులు

వ. నెం	స్టేజ్-2 షరతులు
3.1	రాష్ట్ర అటవీ శాఖ ఆమోదించిన పథకం ప్రకారం, ఏలూరు సెక్షన్‌లోని రామ సింగవరం ఫారెస్ట్ బ్లాక్‌లోని కాంప్ నంబర్ 200 & 201లో గుర్తించబడిన 2.50 హెక్టార్ల క్షీణించిన అటవీ భూమిపై పరిహార అటవీకరణ (%జూా%)ను పెంచాలి, దీని ఖర్చును యూజర్ ఏజెన్సీ నుండి సేకరించాలి.
3.2	WP నం.1164/2023 లోని తుది ఫలితం ఆధారంగా, వర్తిస్తే, మళ్లించబడిన అటవీ ప్రాంతానికి బదులుగా, వినియోగదారు ఏజెన్సీ NFL ప్రాంతంలో పరిహార అటవీకరణక" CA ని అందించాలి, ఇది ప్రస్తుతం గౌరవనీయులైన భారత సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర అటవీ శాఖ ఈ విషయంలో వినియోగదారు ఏజెన్సీ నుండి ఒక హామీని పొందేలా చూసుకోవాలి.
3.3	యూజర్ ఏజెన్సీ CA కొరకు రూ.68,06,634/- మరియు NPV (CA కొరకు రూ.9,82,000/-, NPV కొరకు రూ.19,94,738/- మరియు జరిమానా NPV గా రూ.38,29,896/-) చెల్లించింది. UA చెల్లించిన లెవీలను ఆమోదించబడిన ప్లాన్/స్కీమ్ ప్రకారం ఉపయోగించుకోవాలి.

పైన పేర్కొన్న షరతుల నెరవేర్పుపై సమ్మతి నివేదిక అందిన తర్వాత, ప్రతిపాదనను అటవీ (సంరక్షణ) చట్టం, 1980లోని సెక్షన్ 2 కింద తుది ఆమోదం కోసం పరిగణిస్తారు. ఈ విషయంలో ప్రభుత్వం తుది ఆమోదం ఇచ్చే వరకు అటవీ భూమి బదిలీ అమలు చేయబడదు.

ఇంకా, ఈ సూత్రప్రాయ ఆమోదం ఈ లేఖ జారీ చేసిన తేదీ నుండి 2 సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుందని కూడా గమనించవచ్చు. పైన పేర్కొన్న షరతులను 2 సంవత్సరాలలోపు పాటించని సందర్భంలో, సూత్రప్రాయ ఆమోదం చెల్లదు.

మీ నిబద్ధతతో
(బాలాజీ కరి)
అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్(కేంద్రం)